# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 223
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
జూన్ 04, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## 100 రోజుల కార్యక్రమాలపై అవగాహన

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో బుధవారం 10వ డివిజన్ కాకతీయ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖడే, సానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొని నగర ప్రజలకు అవగాహన కల్పించారు.

– వరంగల్ వాయిస్, వరంగల్

# సాగుకు సన్నద్ధం ..

- ముందే పలకరించిన వర్షాలు
- ప్రారంభమైన వ్యవసాయ పనులు
- ఖరీఫ్ సీజన్ కు అన్నదాతల కసరత్తు
- నకిలీ విత్తనాలపై నియంత్రణ కరువు
- ఇప్పటికే పల్లెల్లోకి అడుగుపెట్టిన ప్రైవేట్ వ్యాపారులు





ముందస్తుగానే తొలకరి పలకరించింది. ఇప్పటికే కురిసిన వానలకు రైతులు వేసవి దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఊరు వాడ అంతా నాగలి పట్టి పోలం బాట పడుతున్నారు. పత్తి పంట కోసం చెలకలు, వరి సాగుకోసం నారు మళ్లు సిద్ధం చేస్తున్నారు. దీంతో పంటపొలాలు రైతులు, కూలీలతో కళకళలాడుతున్నాయి. అవసరమైన విత్తనాలు, ఎరువులకోసం అన్నదాతలు పట్నం బాట పట్టారు. పెద్ద ఎత్తున తరలి వస్తున్న అన్నదాతలతో పట్టణాల్లోని సీడ్స్, ఎరువుల షాపులు రద్దీగా మారాయి. అయితే నకిలీ విత్తనాలపై నియంత్రణ కరువు కావడంతో పల్లెల్లో ప్రైవేట్ వ్యాపారుల దందా మూడు పువ్వులు..ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. తమ కంపెనీ విత్తనాలు వాడితే దిగుబడి అధికంగా రావడంతో పాటు ఉచిత బహుమతులు అందజేస్తామంటూ ప్రచారం చేస్తున్నారు. అన్నదాతలను నమ్మించి జోరుగా విక్రయాలు సాగిస్తున్నారు. - వరంగల్ వాయిస్, తొర్రూరు

వివరాలు2లో..



2లో..

## దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ఎండోమెంట్ మంత్రి కొండా సురేఖ
- వేద పాఠశాల నిర్మాణానికి భూమి పూజ



2లో..

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




# సాగుకు సన్నద్ధం..



- ముందే పలకరించిన వర్షాలు
- ప్రారంభమైన వ్యవసాయ పనులు
- ఖరీఫ్ సీజన్ కు అన్నదాతల కసరత్తు
- నకిలీ విత్తనాలపై నియంత్రణ కరువు
- ఇప్పటికే పల్లెల్లోకి అడుగుపెట్టిన ప్రైవేట్ వ్యాపారులు

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఖరీఫ్ సీజన్ సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ యేడాది ముందస్తుగానే వరుణుడు పలకరించడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. పత్తి పంట కోసం చెలకలు సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే వరి నారు మళ్ళు దున్నుకుంటున్నారు. దీంతో పంటపొలాలు రైతులు, కూలీలతో కొన్ని చోట్ల కళకళలాడుతున్నాయి. రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తుండడంతో పట్టణాల్లోని సీడ్స్, ఎరువుల షాపులు రద్దీగా ఉంటున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో గత రబీ సీజన్ వడ్లు కొనుగోలు ప్రక్రియ ఆలస్యంగా జరుగుతుండడంతో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన బస్తాలు, మొలకెత్తిన ధాన్యం కనబడుతోంది.

### బోనస్ కోసం ఎదురుచూపు..

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం వరి ధాన్యం అమ్ముకున్న రైతులకు గత ఖరీఫ్ సీజన్ లో క్వింటాల్ ఒక్కంటికీ రూ.500 చొప్పున బోనస్ ఇచ్చారు. కానీ ఇప్పుడు రబీ సీజన్ లో కొనుగోలు చేసిన ధాన్యానికి వడ్లకు రావాల్సిన డబ్బులు రైతుల అకౌంట్లలో జమ చేశారు. కానీ వారాలు గడుస్తున్నా బోనస్ చెల్లించక పోవడంతో అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆ బోనస్ వస్తే పెట్టుబడి కోసం కొంత సహాయంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు పథకం కంటే కూడా సన్న రకం వరి ధాన్యంకు చెల్లించే బోనస్ విధానం బాగుందని పలువురు అంటున్నారు. మాటల వరకే పరిమితం కాకుండా పోయిన సీజన్ కు ఇచ్చినట్లుగా ఇప్పుడు కూడా సన్న వడ్లకు బోనస్ చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

### నాసిరకం విత్తన నియంత్రణకు చర్యలేవీ?

ఖరీఫ్ సీజన్ సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. దీంతో ఇప్పటికే ప్రైవేట్ విత్తన వ్యాపారులు, కొన్ని కంపెనీల మధ్యవర్తులు గ్రామాల్లో తిరుగుతూ రైతులకు తమ కంపెనీ సరుకులను అంటగడుతున్నారు. కాబట్టి ఆయా శాఖల అధికారులు అన్నదాతలకు నూతన వ్యవసాయ విధానాలు, విత్తన, ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు. లైసెన్సులు లేకుండా ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయిస్తున్న షాపులపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# 'ఎర్రగడ్డ' ఘటనపై మంత్రి దామోదర ఆరా

### ఫుడ్ పాయిజనింగ్‌పై విచారణకు ఆదేశం

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ అవతరణ దినోత్సవం రోజు ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో చోటు చేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో కలుషితాహారం ఘటనలో ఒక రోగి మృతి చెందడంతో పాటు 70 మంది అస్వస్థతకు గురయ్యారు. జూన్ 2న జరిగిన ఈ ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ స్పందించారు. మొత్తం 92 మంది రోగులు అస్వస్థతకు గురవగా, వారిలో 18 మందికి తీవ్రంగా ఉండటంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా సహా ఇతర ఆసుపత్రుల్లో చేర్పించి ఆరు వైద్య బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. ఈ ఘటనపై మంత్రి దామోదర రాజ నరసింహ మాట్లాడుతూ, ఫుడ్ పాయిజన్ కు కారణంగా ఆసుపత్రిలో అందించిన ఆహారమే అని ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు వెల్లడించారు. అదనంగా అందించిన స్వీట్ కూడా అనారోగ్యానికి కారణమైనట్లు అనుమానం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాధితుల ఆరోగ్యం మెరుగవుతోందనీ, ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. వారు రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుంటారని చెప్పారు. ఈ ఘటనకు కారణమైన డైట్‌ను పర్యవేక్షించే కాంట్రాక్టర్ పనితీరు సంతృప్తికరంగా లేనందున అతని కాంట్రాక్టును రద్దు చేసినట్టు మంత్రి తెలిపారు. ఇదే సమయంలో ఘటనపై సమగ్ర విచారణ కోసం ఒక ప్రత్యేక కమిటీని నియమించామని, కమిటీ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఇక ఫుడ్ పాయిజన్ కారణంగా మరణించిన వ్యక్తి కరణ్‌కు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి కోణంలో ఈ ఘటనపై ఆందోళన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బుధవారం కూడా పలువురు రోగులు డయేరియా లక్షణాలతో బాధపడుతున్నారు. వీరిలో 18 మందిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కలుషితాహార ఘటనపై ఎర్రగడ్డ ఆసుపత్రిలో డీఎంఈ, డీఎంహెచ్ఓ, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. తాగునీరు కలుషితమైందా? అనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు. ఈ సంఘటనకు కారణాలు తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షలకు పంపారు.



# దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ఎండోమెంట్ మంత్రి కొండా సురేఖ
- వేద పాఠశాల నిర్మాణానికి భూమి పూజ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. భద్రకాళి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి సురేఖ బుధవారం శంకుస్థాపనలు చేశారు. వేద పాఠశాల నిర్మాణం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. వేద పండితుల కోసం నూతనంగా నిర్మించ తలపెట్టిన వేద పాఠశాల కోసం రూ.1.30 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేసినట్లు వివరించారు. భద్రకాళి టెంపుల్ డెవలప్మెంట్ విషయంలో మాడ వీధులకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ నుంచి రూ.10 కోట్లు, ఎస్ డీఎఫ్ నుంచి రూ.20 కోట్లు ఇచ్చినట్టు వివరించారు. దాదాపు రూ.30 కోట్లతో మాడ వీధులు, రాజగోపురాలకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. భక్తుల రద్దీ పెరుగుతున్న విషయంలో తొక్కిసలాట కాకుండా ఉండాలని ఈ సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దేవాదాయ భూములను ఎవరైనా ఆక్రమించుకుంటే ఖాళీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాగా, భద్రకాళి టెంపుల్ కి గత 11 సంవత్సరాలుగా ఈ దేవాలయానికి కమిటీ లేదని మంత్రి నొక్కి చెప్పారు. అయితే, ఆ కమిటీని త్వరలోనే వేయబోతున్నామని ఈ సందర్భంగా మంత్రి సురేఖ గుర్తు చేశారు.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. బుధవారం వరంగల్ మండలం ఏనుమాముల, ఖిలా వరంగల్ మండలం అల్లీపూర్ గ్రామాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే వర్ధన్నపేట మండలంలో పైలెట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు జరిపి, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామని అన్నారు. . తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలను నెలకొల్పి, ప్రతి రోజు ప్రతి మండలంలో రెండు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

### మార్పులు, చేర్పులు..

భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్ లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదా బైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బీలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించి సమర్థ నిర్వహణకు అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



### రేషన్ షాప్ లో కలెక్టర్ తనిఖీ..

రేషన్ షాపుల ద్వారా సకాలంలో వినియోగదారులకు రేషన్ బియ్యం ఇతర వస్తువులు పంపిణీ చేయాలని, ఎప్పటికప్పుడు సంబంధిత రికార్డులను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం వరంగల్ మండలంలోని ఏనుమాముల భూభారతి గ్రామసభలో పాల్గొని తిరిగి వెళుతున్న క్రమంలో బాలాజీ నగర్ చౌక ధరల దుకాణం వద్ద ఎక్కువ మంది గుమ్మిగూడి ఉనట్లు గమనించిన కలెక్టర్ వెంటనే తన వాహనాన్ని ఆపి బాలాజీనగర్ రేషన్ షాప్ ను తనిఖీ చేశారు. ఎండాకాలం దృష్ట్యా వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా వారి సౌకర్యార్థం ప్రతిరోజు 15 చొప్పున టోకెన్లు ముందుగానే అందజేసి క్రమ పద్ధతిలో బియ్యం, ఇతర వస్తువులు పంపిణీ చేయాలని డీలర్ ను కలెక్టర్ ఆదేశించారు. షాపునకు సంబంధించిన స్టాక్ వివరాల బోర్డులు, ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

## కలిసి కట్టుగా..

# కోవెల పునర్నిర్మాణం



- కాకతీయుల కాలంలో వైభవంగా పూజాధి కైంకర్యాలు
- యుద్ధాల కారణంగా ధ్వంసమైన విగ్రహాలు
- గ్రామస్థులంతా ఏకమై ఆలయాల పునర్నిర్మాణం
- శుక్రవారం నుంచి మూడు రోజులు ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు
- బొడ్డు చింతలపల్లిలో దేవుళ్ల పండుగ
- ఊరంతా సందడే సందడి...

**వరంగల్ వాయిస్, గీసుకొండ :** కాకతీయుల కాలం నిత్యం పూజాధి కైంకర్యాలు జరిగిన దేవాలయం అది.. రాజ్యాలు, రాజులు మారే తరుణంలో జరిగిన యుద్ధాల ఫలితంగా ధ్వంసమైన ఆ ఆలయం యొక్క చరిత్రను తెలుసుకున్నా ఆ గ్రామస్థులు.. అందరూ ఏకమై ఆ ఆలయాన్ని పునర్నిర్మించే బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. కాకతీయుల నిర్మాణ శైలి, ఆగమశాస్త్ర నియమాలు, స్థలపురాణ పద్ధతులు అనుసరించి శివరామ క్షేత్రాన్ని నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు.. ఆ ఆలయమే వరంగల్ జిల్లా గీసుగొండ మండలం బొడ్డు చింతలపల్లిలో నిర్మించి ప్రారంభోత్సవ హంగులతో విరాజిల్లుతుంది.

రాచరిక కాలంలో యుద్ధాల ప్రభావం వల్ల ధ్వంసమై, చెల్లాచెదురుగా పడి ఉన్న విగ్రహాలను చూసిన బొడ్డు చింతలపల్లి గ్రామస్థులు ఆలయం యొక్క చరిత్రను గ్రామంలోని వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులంతా రాజకీయాలను అతీతంగా ఏకమై ఆలయం నిర్మాణానికి 2020లో శ్రీకారం చుట్టారు. గ్రామస్థులు అందరూ ఏకమై తలా ఇంతా విరాళాల రూపంలో సుమారు ఇప్పటివరకు రూ.అర కోటి వరకు అందజేశారు. ఆలయ నిర్మాణం ప్రారంభించిన నాటి నుంచి ప్రారంభోత్సవ తంతు పూర్తయ్యేవరకు దాదాపు రూ.కోటిన్నర వరకు ఖర్చు అయినట్లు ఆలయ నిర్మాణ కర్తలు అయిన గ్రామస్థులు తెలిపారు. ఇందులో గ్రామస్థులు రూ.50 లక్షల వరకు ఇవ్వగా.. మిగిలిన రూ.కోటి దాతల సహకారంతో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

### ఆలయాల గురించి..

స్వయంభులింగ అవతరించిన ఈ ఆలయం కాకతీయుల భక్తికి తార్కాణంగా నిలిచింది. హిందూ ధర్మాన్ని పరిరక్షించిన కాకతీయుల శ్రద్ధకు నిదర్శనంగా చెన్నకేశవస్వామి ఆలయం ఉంది. శతాబ్ధాల చరిత్ర కలిగిన ఆంజనేయ స్వామి, త్రిశక్తి పీఠం అమ్మవారి ఆలయం గత చరిత్రను మనకు తెలిపే విధంగా ఉంది. ఈ ఆలయాలు శిథిలావస్థకు చేరడంతో ఇప్పుడు గ్రామస్థుల ఐక్యత, ఆర్థిక సహకారంతో పునర్నిర్మితమైనది. కాకతీయుల శిల్పకళా అభిరుచికి ఏ మాత్రం తీసిపోకుండా ఆలయాలు పూర్వ వైభవం ఉండేలా ప్రతిష్ఠాచార్యులు, వేద పండితుల ఆధ్వర్యంలో పునః ప్రతిష్ఠ జరుగుందని గ్రామస్థులు తెలిపారు.

### గ్రామస్తులు నిర్మించిన ఆలయాలు ఇవి..

పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, సీత సమేత రామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఆలయం, భద్రకాళి సమేత వీరభద్రస్వామి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నవగ్రహాలు, చెన్నకేశవస్వామి ఆలయాలను నిర్మించారు.

### ఉత్సవాలు ఇలా..

మొదటి రోజు అనగా శుక్రవారం 06న మంగళవాయిద్యాలు, వేదపారాయణం, గణపతి పూజ, జలాధివాసం, ధ్వజారోహనం తదితర కార్యక్రమాలు ఉంటాయి. రెండో రోజు అనగా శనివారం 07న వాస్తు హోమం, రుద్ర హోమం, శ్రీరామ హోమం, క్షీరాధివాసము, బలిహరణతో కూడిన గ్రామ ప్రదక్షిణ, ధాన్యాధివాసం, వస్త్రాధివాసం తదితర కార్యక్రమాలు.


మూడో రోజు అనగా ఆదివారం 08న గవ్యాంత పూజలు, యంత్ర స్థాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన, ప్రాణప్రతిష్ట, మహాపూర్ణాహుతి, మహాకుంభాషేకం తదితర కార్యక్రమాలతో ఆలయాలు ప్రారంభించడం జరుగుతుంది దేవాలయ కమిటి నిర్వాహకులు తెలిపారు.













WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, జూన్ 04, 2025

# పేదోడి సొంతింటి కల నెరవేరుస్తున్న ప్రజాప్రభుత్వం

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలో చిలకల పేట గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు సూచించిన విధంగా వివిధ దశలకు ఇంటి నిర్మాణం బిల్లులను చెల్లించడం జరుగుతుందని, ఉచిత ఇసుకను పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎవరికి ఒక్క రూపాయి





ఇవ్వద్దని, ఎవరైనా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని, పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని అన్నారు. ఆత్మకూరు మండలం పెంచికలపేట గ్రామపంచాయతీ పరిధిలో హెల్త్ సబ్ సెంటర్ భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు వినతి పత్రాన్ని అందజేశారు.

## భూభారతి అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని గూనిపర్తి గ్రామంలో భూభారతిలో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హనుమకొండ ఆర్డీఓ రమేష్ రాథోడ్ తో పాటు కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్ డిప్యూటీ తాసిల్దార్ శోభారాణి కాంగ్రెస్ నాయకులు ,కడారి వెంకటేష్, కూచన నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హరిత యోగ శిబిరం ఆధ్వర్యంలో ములుగు రోడ్ లోని స్వయంకృషి మహిళా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ప్రముఖ యోగ గురువు పోశాల శ్రీనివాస్ తెలియజేశారు. ఈ సందర్భంగా యోగా గురువు శ్రీనివాస్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తూ తన దగ్గర యోగా నేర్చుకుంటున్న యోగసాధకుల కుటుంబాలలో ఏ శుభకార్యమైన వారిని ప్రోత్సహించి ఇలాంటి అనాధ ఆశ్రమాలలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. గోపాల్ పూర్ కి చెందిన ఎంఆర్ సీబీ చైర్మన్ ముత్యాల సుజాత మల్లికార్జున్ కూతురు చిద్రుపి జన్మదిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పురోహితులు నాగిళ్ల వేణు శర్మ అయ్యగారు పాల్గొన్నారు.

## అనుమతి లేని షాహిన్ హైస్కూల్‌ను సీజ్ చేయాలి



**వరంగల్ వాయిస్, పోచం మైదాన్:** అనుమతి లేకుండా నిర్వహిస్తున్న షాహిన్ హైస్కూల్‌ను వెంటనే సీజ్ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ అంశంపై ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నేతలు కలసి గట్టిగా ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ  నగర నడిబొడ్డులో అనుమతులు లేకుండా స్కూల్‌ను స్థాపించి ప్రజలను మోసం చేస్తూ, లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న షాహిన్ హైస్కూల్ యాజమాన్యం పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కూల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, అలాగే విద్యాశాఖ అధికారుల నిస్సత్తువ వల్ల యాజమాన్యానికి పరోక్షంగా సహకారం లభిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు బుధవారం వరంగల్ మండల విద్యాశాఖ అధికారి అశోక్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనుమతి లేకుండా నడుపుతున్న ఈ పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలని, షాహిన్ స్కూల్‌లో అడ్మిషన్ తీసుకుని విద్యార్థులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి రోహిత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మహా గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తన గాన మాధుర్యంతో సినీ జగత్తును ఐదు దశాబ్దాల పాటు మకుటం లేని మహారాజుగా 50వేల అద్భుతమైన పాటలు 15భాషలలో ఆలపించి సంగీత ప్రియుల హృదయాలలో చెరగని ముద్ర వేసిన మహా గాయకుడు కీర్తిశేషులు ఎస్పీ బాలసుబ్రమణ్యం అని సామాజికవేత్త, సంగీత అభిమాని నిమ్మల శ్రీనివాస్ అన్నారు. వారి జయంతిని పురస్కరించుకొని మాట్లాడుతూ భౌతికంగా గానగాంధర్వుడు బాలు మన మధ్య లేకపోయినా వారు అందించిన అన్ని భాషల మధుర గీతాలు  ప్రతినిత్యం మనం వింటున్నామని, వారి పట్టుదల, దీక్ష, సాధనను ప్రేరణగా తీసుకుని ఎంతోమంది గాయకులు ఎదిగారని ఆయన అన్నారు. పలు భాషలలో మధుర స్వరంతో వారు ఆలపించిన గీతాలు చిరస్థాయిగా నిలిచాయని తెలుపుతూ వారి జయంతి సందర్భంగా నివాళులర్పించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిక




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ విద్యాకమిటీ చైర్మన్ వేములపెల్లి కుమారస్వామి,వేములపెల్లి శివకృష్ణ, ముదిగొండ రాజులు కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలకు ప్రజా పాలనకు ఆకర్షతులై బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాపురం మాజీ సర్పంచ్ తప్పేట రమేష్, మాజీ వైస్ ఎంపీపీ పురం రాంబాబు, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ రాజబోయిన దూడయ్య, మాజీ ఉప సర్పంచ్ తప్పేట స్వామి, పండుగ రాజు, చేలాగోల రాజు పాల్గొన్నారు.

## కొడవటంచ ఆలయ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని కొడవటంచ గ్రామంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన నాణ్యతతో పూర్తి చేయాలని వివిధ శాఖల అధికారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు ఆదేశించారు. బుధవారం ఉదయం కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ అతిథి గృహంలో ఎమ్మెల్యే జీఎస్సార్ ఆలయ కమిటీ చైర్మన్, దేవాదాయ శాఖ, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, రూరల్ వాటర్ సప్లై అధికారులు, గుత్తేదార్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. గణపురం మండలం బుద్ధారం నుండి రేగొండ మండలంలోని కొడవటంచ వరకు జరుగుతున్న రెండు వరుసల రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భాగిర్థిపేట స్టేజీ, రేగొండ పోలీస్ స్టేషన్, లింగాల క్రాస్ వద్ద జరుగుతున్న ఆర్చి పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఆలయ గర్భ గుడి పనులు, కాంపౌండ్ వాల్, ఆలయ మాడ వీధుల్లో సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ పనులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఇతర అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. అన్ని అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంకు ఆహ్వానించనున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే బాలాలయంలో ప్రత్యేక పూజలు చేసి, గర్భగుడి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు.

# కష్టమైన పనిని ఇష్టంగా చేస్తున్నా

● కార్పొరేటర్ పల్లం పద్మ రవి

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్‌లోని ఎస్.ఆర్ఆర్ తోటలో నూతన కమ్యూనిటీ హాల్ (గ్రంథాలయం) నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ భవనం నిర్మాణం పురాతన కోనేరు స్థలంలో జరుగుతోంది. భూమి సరిగా లేకపోవడం, నిర్మాణానికి అనుకూలంగా లేకపోవడం వలన పనులు నెమ్మదిగా సాగుతున్నా, కార్పొరేటర్ పల్లం పద్మ రవి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ కష్టపడి పనులను ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఎస్ఆర్ తోటలో అనేక ప్రభుత్వ భూములు, కోనేరు స్థలాలు ఆక్రమణలో ఉన్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్‌కు అనువైన స్థలాన్ని ఎంపిక చేసి, ప్రతిభావంతులైన ఆర్కిటెక్ట్‌ల సలహాలతో నిర్మాణాన్ని ప్రారంభించాం. పనులను నాణ్యంగా, నిబంధనల మేరకు పూర్తి చేయాలని సూచించామని తెలిపారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ



సహకారంతో ఈ డివిజన్ అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ఆమె తెలిపారు. కమ్యూనిటీ హాల్ పూర్తయ్యాక ఇది పేద ప్రజలకు, విద్యార్థులకు, విద్యావంతులకు ఎంతో ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మ రవితో పాటు అధికారులు, కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వైభవంగా నవ గ్రహ దేవతల ప్రతిష్ఠాపన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శ్రీ ఆది మహాలక్ష్మి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ ఆది మహాలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి, సువర్చల సమేత ఆంజనేయ స్వామి ఆలయాలు ఒకే ప్రాంగణంలో వెలసి భక్తులకు అపారమైన దైవానుభూతిని ప్రసాదిస్తూ, దినదినాభివృద్ధి చెందుతున్నాయి. ఈ ఆలయంలో ఈశాన్య దిక్కున అత్యంత అందంగా నవగ్రహ మండపం నిర్మించబడింది. ఈ రోజు, స్వస్తిశ్రీ విశ్వాస నామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ నవమి బుధవారం సందర్భంగా త్రాగ్నిక దీక్షతో నవ గ్రహ దేవతల ప్రతిష్ఠ వైదికంగా ప్రారంభమైంది. ఈ మహోత్సవం ఆగమ సామ్రాట్, స్వర్ణ కంకణ సన్మానితులు శ్రీ భద్రకాళి శేషు నేతృత్వంలో, స్మార్త విశారద శ్రీ గుమ్మడవెల్లి గణేష్ ఆత్రేయ శర్మ ఆచార్యత్వంలో వేద ఘోషలతో, నామ సంకీర్తనలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించబడుతోంది. ఈ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆర్థికంగా అయిత రాజయ్య, జె.కె. శర్మ,బజ్జూరి కావ్య అమర్నాథ్, జూలూరి రవికుమార్, వినయ్ కుమార్, గజ్జి భాస్కర్, ఓడపల్లి విజయ్ కుమార్, దాదాపు 90 మంది భక్తులు వీరు తలసరి రూ. 10,116 చొప్పున దానంగా అందించారు. గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, మాతృకా పూజ, నాంది వృత్తి, వరణం, మధుపర్క, వర్ధిని పూజ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, సర్వతోభద్ర, వాస్తు యోగిని, నవగ్రహ, క్షేత్రపాల, మండల దేవతా యజ్ఞాలు, బలి ప్రదానాలు, మూలమంత్ర హవనాలు నిర్వహించబడుతున్నాయి. శ్రీ రవికుమార్, వెంకట శర్మ, ముఖేష్ తివారి, శివశర్మ, వెంకన్న శర్మ, సాయి ప్రణీత్ శర్మ, హరిప్రసాద్, రామానుజ శర్మ, వివేక్ శర్మ, సాకేత్ శర్మలు ఈ కార్యక్రమాలను వేద మంత్రాలతో వైభవంగా నిర్వహిస్తున్నారు.

## ఎయిర్ పోర్టు భూ నిర్వాసితులకు
# 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలి

- నగర సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం
- ఎంసీపీఐ(యూ) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వినాశనకర విధానాలతో ప్రజా సమస్యలు పేరుకుపోయి పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంసీపీఐ(యూ) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ అన్నారు. నగర సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గమని అందుకు అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య)- ఎంసీపీఐ(యూ) వరంగల్ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం ఎగ్గని మల్లికార్జున్ అధ్యక్షతన అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్లో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుంచు జగదీశ్వర్ మాట్లాడుతూ జనాభా పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న వరంగల్ నగరంలో పేద మధ్యతరగతి ప్రజలు నివసించే కాలనీలు సమస్యలతో విలయతాండవం చేస్తున్న పట్టించుకునే నాథుడే లేడని, ఎన్నికల హామీలన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారాయని రాష్ట్రానికి వరంగల్ పట్టణాన్ని రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పి కనీసం నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. పైగా వివిధ రకాల ప్రభుత్వ భూములు ప్రభుత్వ అధికారుల అన్నదండలతో యదేచ్ఛగా ఆక్రమించి అమ్మకాలకు కొనుగోలుకు పాల్పడుతున్న భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారని, పేదల నివాస స్థలాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మామునూరు ప్రాంతంలో ఎయిర్ పోర్టు అనేక పోరాటాల ఫలితంతో ప్రకటించినప్పటికీ నిర్వాసితులకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని వర్తింపజేసి నిర్వాసితుల కోరికల కనుగుణంగా తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేదల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించి తక్షణమే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు తక్షణమే పూనుకోవాలన్నారు. ఈ క్రమంలో నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రజా పోరాటాలకు శ్రీకారం చుట్టాలని అందుకు నాందిగా గుర్తించిన సమస్యలపై మున్సిపల్ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అధికారుల స్పందన బట్టి పోరాటాల రూపకల్పనకు పూనుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు ఐతం నాగేష్, మాలి ప్రభాకర్, అప్పనపురి నరసయ్య, యగ్గని మల్లికార్జున్, నగర నాయకులు నలివెల రవి, రాయినేని ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



**వరంగల్ వాయిస్, కురవి :** సీపీఐ మానుకోట జిల్లా 3వ మహాసభలు రెండు రోజుల పాటు కురవి మండల కేంద్రంలో నిర్వహిస్తున్నందున వాటి జయప్రదానికి సహకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి కరణం రాజన్న అధ్యక్షత జరిగిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయ సారథి మాట్లాడుతూ నాల్గవ అతి పెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగిందని గొప్పలు చెపుతున్న మోదీ దేశంలో మునుపెన్నుడు లేని విధంగా నిరుద్యోగం, ఆకలి, ఆర్థిక అసమానతలు పెరిగి పోయాయని, తలసరి ఆదాయం పెరగడంతో పాటు పేదరికం విపరీతంగా పెరిగి, కార్పొరేట్ల దగ్గర లక్షల కోట్ల రూపాయలు పోగుపడ్డాయని విమర్శించారు.

**మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు..**

ఆహ్వాన గౌరవ అధ్యక్షులుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్,అధ్యక్షులుగా బి విజయసారథి, కార్యనిర్వహక అధ్యక్షులుగా నల్లు సుధాకర్ రెడ్డి,ఉపాధ్యక్షులు గా తమ్మెర విశ్వేస్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా బి అజయ సారథి రెడ్డి, ఉపప్రదన కార్యదర్శిగా కట్టబోయిన శ్రీనివాస్, కోశాధికారిగా కరణం రాజన్నలను ఎన్నుకున్నారు. కురవిలో జరిగే మహాసభలు రాబోయే మూడు సంవత్సరాలకు ప్రజా సమస్యలపై పోరాటాలకు, పార్టీ పటిష్టతకు, స్థానిక సంస్థలలో ఎక్కువ స్థానాలు గెలవడానికి కార్యాచరణ సిద్ధం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, పెరుగు కుమార్, మామిండ్ల సాంబలక్ష్మి, చింతకుంట్ల వెంకన్న, నవీన్, వరిపల్లి వెంకన్న, పాండు రంగాచారీ, వోమ భిక్షపతి, బుర్ర సమ్మయ్య, కె.ప్రబేష్ శ్రవణ్ పాల్గొన్నారు.

# ఉర్సు ఎల్లమ్మ తల్లి ఆలయం అభివృద్ధికి సహకారం

**కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు**

**మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :**ఉర్సు కరీమాబాద్ గౌడ కులస్తులకు అన్ని విధలా అండగా ఉంటానని, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం పునర్నిర్మాణం పనులకు తగిన సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిధర్ రావు తెలిపారు. బుధవారం ఉర్సు తాళ్ల మండువాలోని వేడుకల మందిరంలో ఉర్సు, కరీమాబాద్ గౌడ కులస్తులకు చెందిన 80 గజాల రిజిస్ట్రేషన్ దస్తావేజులను కొండా మురళి పంపిణీ చేశారు. ఎల్లమ్మ ఆలయం పునర్నిర్మాణం పనులకు దేవాదాయశాఖ ద్వారా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గౌడ కమ్యూనిటీ హల్ నిర్మాణ పనులకు రూ.50 లక్షలు మంజూరు చేస్తామనన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ కు గౌడ కులస్తులు అండగా ఉండాలని, కాంగ్రెస్ ను గెలిపించాలని కోరారు. గౌడ కులస్తులకు అన్ని వేళలలో అండగా ఉంటానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గోపాల నవీన్ రాజ్, మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్లు బత్తిని వసుంధర, నాగపూరి కల్పన, శోభ, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, గౌడ సంఘం పెద్దలు బత్తినిఅఖిల్, శ్యామ్, మదూరి సుధాకర్, మండా వెంకన్న, బత్తిని హరి, సతీష్, నాగపూరి సంజయ్ బాబు, కుమారస్వామి, బుజ్జి బాబు , గడ్డం యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలు పరిష్కరించేందుకే భూ భారతి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టర్ రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపురం గ్రామాన్ని సందర్శించి భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహణ తీరును పరిశాలించారు. వారసత్వం, సాదా బైనామా దరఖాస్తులు ఎక్కువ వచ్చినట్లు తహసీల్దార్ కలెక్టర్ కు తెలిపారు. తహసీల్దార్ మోసిన్ ను దరఖాస్తుల స్వీకరణపై కలెక్టర్ వివరణ కోరగా 59 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ కు వివరించారు. సదస్సు విశిష్టత గ్రామంలో ప్రతి ఒక్కరికి తెలియజేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా మోర్తాల మహేందర్ పిర్యాదు మేరకు అతని తల్లి రాధమ్మ ను రప్పించి కుటుంబ వివాదం త్వరగా పరిష్కరించు కోగలిగితే భూ సమస్య కూడా త్వరగా పరిష్కరిస్తామని కలెక్టర్ తెలియజేశారు. సాధ్యమైనంత వరకు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. హెల్ప్ డెస్క్ ను సందర్శించి దరఖాస్తు లను వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మోసిన్, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు ఫొటో బహూకరణ



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** కరీంనగర్ కు చెందిన పుల్లూరి కావ్యశ్రీ లక్ష్మణ్ దంపతుల ఏకైక పుత్రిక సంజన– సచిన్ కుమార్ ల వివాహ మహోత్సవం అంగరంగ వైభవంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కేఎస్ఎల్ గార్డెన్ ఉత్సవ్ ఫంక్షన్ హాల్ లో గురువారం జరిగింది. జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు–స్వప్న దంపతులు హాజరై నూతన వధూవరులైన సంజన సచిన్ కుమార్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి ఫ్యామిలీ ఫోటోను బహూకరించారు.

# రాహుల్ ప్రధాని అవుతాడని కలలు కంటున్నారు

## ● మాజీ ఎమ్మెల్యే ఎన్ వీఎస్ఎస్ ప్రభాకర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే భయంకరమైన కలలు కంటున్నాడని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వీఎస్ఎస్ ప్రభాకర్ ఎద్దేవా చేశారు. దేశంలో యువత ఉద్యోగాలు చేసే వారుగా కాకుండా.. ఉద్యోగాలు ఇచ్చే వారీగా ప్రధాని మోదీ తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ వరంగల్ జిల్లా కార్యాలయంలో బుధవారం 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం – సంకల్పంతో సాకారం జిల్లా కార్యశాల కార్యక్రమాన్ని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ఎన్ వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నది రాహుల్ గాంధీ కుటుంబమే అని గుర్తు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్ట పెరుగుతుంటే.. మోదీని నాయకుడిగా కీర్తిస్తుంటే దేశానికి గర్వకారణం కాదా అనేది ఖర్గే చెప్పాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ సింధూర్ లాంటి దాడులను కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పాకిస్తాన్ పై ఎప్పుడైనా చేశారా అని ప్రభాకర్ ప్రశ్నించారు. ఇక కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 11 ఏళ్ల మోదీ పాలనలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదే అన్నారు. దేశంలో గత 60 ఏళ్లుగా జరగని ఎన్నో అభివృద్ధి పనులు ఈ 11 ఏళ్లలో చేసి చూపిన ఘన ప్రధాని మోదీ అన్నారు. సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దు, త్రిబుల్ తలాఖ్ రద్దు, వక్స్ వరణ చట్టం, అయోధ్య రామ మందిర నిర్మాణం, ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని సాహోసపేత నిర్ణయాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ 11 ఏళ్ల మోదీ పాలనలో భారత్ ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలిచిందన్నారు. అది చూసి ఓర్వలేక కాంగ్రెస్ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఈ దేశంలో ప్రధాని మోదీని మించిన బలమైన నాయకత్వం లేనే లేదన్నారు. కులగనన విషయంలో కాంగ్రెస్ మా క్రెడిట్ అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

### బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి : గంట రవికుమార్

భారతీయ జనతా పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. రాష్ట్ర సాధన కోసం 1200 మందికి పైగా యువత, విద్యార్థులు ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. గల్లి నుంచి ఢిల్లీ పార్లమెంట్ వరకు ఆందోళనలు కొనసాగాయన్నారు. కేసీఆర్ హామీ ఇచ్చిన బంగారు తెలంగాణ సాధించలేదు.. కాని వారి కుటుంబం మాత్రం బంగారమైందని ఏద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం నీతి నిజాయితీతో దేశాన్ని అభివృద్ధి చేస్తోందన్నారు. రాష్ట్రాన్ని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, కార్యక్రమం కో– కన్వీనర్లు వడ్డేపల్లి నరసింహులు, ముంద్రాతి వెంకటేశ్వర్లు, జిల్లా పదాధికారులు, జిల్లా వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, కార్యక్రమ మండల కన్వీనర్, కో కన్వీనర్లు పాల్గొన్నారు.





# టీడబ్ల్యూజేఎఫ్ సన్నాహక కమిటీ ఎన్నిక

## హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



**వరంగల్ వాయిస్, జనగామ :** జర్నలిస్ట్ ల సమస్యలపై ముందుండి పోరాడే ఏకైక సంఘం టీ డబ్ల్యూ జే ఎఫ్(తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) అని రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. బుధవారం జనగామ పట్టణంలోని పూసల భవన్ వేడుకల మందిరంలో నిర్వహించిన సమావేశంలో మామిడి సోమయ్య మాట్లాడుతూ టీ డబ్ల్యూ జేఎఫ్ జనగామ జిల్లాలో సన్నాహక కమిటీని ఏర్పాటు చేశామని, గతంలో ఉన్న కమిటీ రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సన్నాహక కమిటీలో నీల నరేష్ బాబు(మెట్రో), గూడూరు లెనిన్(ప్రజాజ్యోతి),చింతకింద కృష్ణమూర్తి(వరంగల్ వాయిస్), బొడ్డు రంజిత్(జనంసాక్షి), గూడూరు కరుణాకర్(తెలంగాణ ముచ్చట్లు), కందుల నర్సింగరావు(జనం), వేముల నర్సింగం(జ్యోతి), కూచన సుప్రీం(టీ ఛానెల్), గోవర్ధన్(దిశ) ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సన్నాహక కమిటీ సభ్యులు నీల నరేష్ బాబు మాట్లాడుతూ జర్నలిస్ట్ ల సమస్యలపై ఎల్లప్పుడూ పోరాడుతానని తెలిపారు. ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లాల జగన్ గౌడ్, బండి విజయ్ కుమార్, జిల్లా నాయకులు పర్శరాములు, నవీన్ చారి, భాస్కర్ పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన రామ రాజేష్ ఖన్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా పరకాల మండలం లోని జీఎస్ఆర్ గార్డెన్స్ లో ధర్మల రాంమూర్తి–రమాదేవి దంపతుల రెండవ కుమారుడు శశికిరణ్–పూర్విక (హారిక) వివాహ వేడుకలకు ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తుల విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# నేతన్న భరోసా పథకానికి మార్గదర్శకాలు విడుదల

## హర్షం వ్యక్తం చేసిన తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రాష్ట్రంలోని చేనేత కార్మికులకు నేతన్న భరోసా పథకం అమలుకు మార్గదర్శకాలను ఆలస్యంగానైనా విడుదల చేయడం హర్షనీయమని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. చేనేత కార్మికుడికి రూ.18,000 అనుబంధం కార్మికుడికి రూ.6,000 రెండు విడతలుగా ఇస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. ఈ పథకాన్ని అమలు జరపాలని చేనేత కార్మిక సంఘాలు అనేక విధాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకు పోవడం జరిగిందన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో జియో ట్యాగ్ వేయని చేనేత మగ్గాలు ఉన్నాయని వాటికి కూడా జియో ట్యాగ్ వేసి వారందరికీ చేనేత భరోసా పథకం అమలు జరపాలని ఆయన సూచించారు. ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసినంత మాత్రాన సరిపోదన్నారు. ఏమాత్రం కాలయాపన చేయకుండా తక్షణమే అమలు జరపాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లుగా నేతన్నలు, సహకార సంఘాల అన్ని రకాల రుణాలు మాఫీ చేయాలని, జాప్యం చేయకుండా చేనేత ప్రాథమిక సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు జరపాలన్నారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

### 6,9 వ డివిజన్ లో క్షేత్ర స్థాయి సందర్శన




**వరంగల్ వాయిస్, వరంగల్ :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయ పడ్డారు. వంద రోజుల ప్రణాళిక అమలులో భాగంగా బుధవారం 6,9 వ డివిజన్ లోని కిషన్ పుర, కాకతీయ కాలనీ ప్రాంతాల్లో కార్పొరేటర్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో సందర్శించడంతోపాటు స్వచ్ఛ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య అవగాహనలో భాగంగా వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందించడం దిన చర్యగా అలవాటు చేసుకోవాలని కోరారు. వ్యాపారాలు నిర్వహించే దుకాణ దారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, ప్రతి రోజు నగర వ్యాప్తంగా పరిశుభ్రమైన నీటిని అందజేయడానికి నీటి సరఫరా సిబ్బంది క్లోరిన్ పరీక్షలు నిర్వహించి నీటిలో పీపీఎం స్థాయిలను నిర్ధారించిన తరువాతే నీటి సరఫరా చేస్తారని జీడబ్ల్యూఎంసీ పరిధిలోని ప్రాంతాలను నివాస యోగ్యమైన స్థిరమైన కార్యాచరణకు అనుకూలమైన నగరంగా తీర్చిదిద్దేందుకు వంద రోజుల కార్యచరణ ప్రణాళిక కొనసాగుతుందని వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడానికి స్థానిక ప్రజలను భాగస్వాములను చేసి స్వచ్ఛ ప్రతిజ్ఞ లను నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బంది గోడ ప్రతులు, కరపత్రాల ద్వారా శానిటేషన్ తీరుపై అవగాహన కలిగించి ఇందుకు సంబంధించిన స్టికర్ లను గృహాలకు అతికించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చీకటి శారద, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, బల్దియా వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపాల్ రావు, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఏఈ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్స్ పంపిణీ చేయాలి

## బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం పేదలకు శాపమైంది

### సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ అంబేద్కర్ కాలనీలో ఉంటున్న పేదలకు గత ప్రభుత్వం డబల్ బెడ్రూమ్స్ నిర్మించి అర్హులైన పేదలకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వమైనా అర్హులైన పేదలకు డబల్ బెడ్రూమ్స్ పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ అంబేద్కర్ కాలనీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబల్ బెడ్రూమ్స్ నిర్మించి వదిలేసిన ఇండ్లను సీపీఐ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 సంవత్సరంలో 592 డబల్ బెడ్రూమ్స్ నిర్మించినప్పటికీ అర్హులైన పేదలకు పంపిణీ చేయలేదని ఆరోపించారు. అంబేద్కర్ కాలనీలోని నిరుపేద కుటుంబాలు గత 20 నుంచి 30 సంవత్సరాలలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పకుండా డబల్ బెడ్ రూమ్స్ ఇస్తామని చెప్పి వారిలో కేవలం ఆరు కుటుంబాలకు మాత్రమే ఇంటి పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. వారు తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో అధికారుల చుట్టూ తిరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిన్న స్వయంగా వారే ఖాళీగా ఉన్న డబల్ బెడ్ రూమ్ లో నివాసముంటమని వంటావార్పు చేసుకుంటామని చెప్పి నిరసనకు దిగేందుకు ఉపక్రమించారన్నారు. స్థానిక ఎమ్మార్వో, ఆర్డీఓ, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చొరవతో అర్హులైన పేదలను గుర్తించి సర్వే చేసి డబల్ బెడ్ రూమ్ లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. డబల్ బెడ్ రూమ్ పంపిణీ చేయని యెడల దశలవారీగా అర్హులైన పేదలకు దక్కేంతవరకు సీపీఐ జిల్లా సమితి వారికి అండగా నిలిచి ఉద్యమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్వి స్టాలిన్, నాయకులు మునగాల భిక్షపతి, వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్, కీర్త ఓదెలు, ఎడబోయిన శ్రీనివాస్, ధర్మరాజు, మద్దెల శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ వాయిస్ సినిమా
బుధవారం 04 జూన్ 2025 7

# అక్టోబర్ 17న రానున్న సిద్ధూ ..
# తెలుసు కదా !

డీజే టిల్లు మూవీతో ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పాటు చేసుకున్న వర్ధమాన నటుడు సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'తెలుసు కదా'. ఈ సినిమాకు నీరజ కోన దర్శకురాలిగా పరిచయం కానున్నారు. తాజాగా టీమ్ ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. సిద్ధు తన స్టైల్‌లో ఫన్నీగా దీన్ని రివీల్ చేశారు. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ఇద్దరూ సిద్ధుతో వీడియో కాల్ మాట్లాడుతున్నట్లు– చూపిస్తూ.. అక్టోబర్ 17న ఈ సినిమా విడుదల కానున్నట్లు తెలిపారు.







## కన్నప్ప ట్రైలర్ లాంచ్‌కు ప్రభాస్

విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప కోసం బాగానే కష్టపడుతున్నారు. వరుసగా ప్రమోషన్లు చేస్తున్నాడు. అయితే ఈ మూవీలో నటించిన బిగ్ స్టార్లు మాత్రం ఇప్పటి వరకు ప్రమోషన్లకు రాలేదు. కనీసం ఒక ప్రెస్ మీట్ కూడా వీరంతా కలిసి పెట్టలేదు. ప్రభాస్, అక్షయ్, మోహన్ లాల్, కాజల్ లలో ఒక్కరు వచ్చినా మూవీ బజ్ అమాంతం పెరుగుతుంది. అందులోనూ ప్రభాస్ రాక కోసం అంతా ఎదురు చూస్తున్నారు. చూస్తుంటే ఫ్యాన్స్ ముందుకు అతి త్వరలోనే ప్రభాస్ రాబోతున్నట్టు తెలుస్తోంది. ఈ వారం చివరలో కన్నప్ప ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఇండోర్ లో భారీ ఈవెంట్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వేడుకకు ప్రభాస్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే తెలుగులో ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా నిర్వహిస్తున్నారు. జూన్ 17న భారీ ఎత్తున ఈవెంట్ చేస్తున్నారంట. ఒకవేళ ట్రైలర్ లాంచ్ కు రాకపోయినా ప్రీ రిలీజ్ ఈవెంట్ కు కచ్చితంగా వస్తున్నాడంట ప్రభాస్. దీని కోసం భారీ ఎత్తున ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. ప్రభాస్ వచ్చిన తర్వాత మూవీపై బజ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అటు అక్షయ్ కుమార్ త్వరలోనే మీడియాతో మీట్ నిర్వహించబోతున్నాడు. అలాగే మోహన్ బాబు, మోహన్ లాల్ కలిసి కొచ్చిలో ప్రెస్ మీట్ నిర్వహిస్తున్నారు. కాజల్ కూడా జాయిన్ అయ్యే ఛాన్స్ ఉంది. మొత్తానికి కన్నప్ప కోసం అందరూ బాగానే కష్టపడుతున్నారు.



## వీరమల్లు ట్రైలర్ కోసం ఆత్రుత

పవన్ కల్యాణ్ హరిహర వీరమల్లు కోసం ఫ్యాన్స్ ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. అనేక వాయిదాల తర్వాత జూన్ 12న మూవీ రిలీజ్ చేస్తున్నారు. కానీ ఇంకా ప్రమోషన్లు స్టార్ట్ చేయలేదు. ట్రైలర్ విడుదల కోసం ఫ్యాన్స్ నుంచి ఒత్తిడి వస్తోంది. ఇంకా పది రోజులే ఉంది.. ఇంకెప్పుడు రిలీజ్ చేస్తారంటూ ఫ్యాన్స్ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత ఏఎం రత్నం ట్రైలర్ రిలీజ్ డేట్ మీద క్లారిటీ– ఇచ్చారు. ఫ్యాన్స్ ఆవేదన నాకు తెలుసు. వారు ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. కానీ సెకండ్ హాఫ్ లో సీజీ వర్క్ చాలా పెండిరగ్ ఉంది. ఆ పనులు స్పీడ్ గా సాగుతున్నాయి. అతి త్వరలోనే వాటిని కంప్లీట్ చేసి రిలీజ్ చేస్తాం అన్నారు ఆ పనులన్నింటినీ దృష్టిలో పెట్టుకునే సినిమా రిలీజ్ డేట్ ను ప్రకటించాం. పోస్ట్ ప్రొడక్షన్ పనులకు టైమ్ పడుతుంది' అంటూ నిర్మాత చెప్పారు. చూస్తుంటే రెండు మూడు రోజుల్లో ట్రైలర్ రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నాయి . రెండు కీలక ఇంటర్వ్యూలు, మూడు భారీ ఈవెంట్లు ప్లాన్ చేస్తున్నట్టు– తెలుస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ సినిమా కోసం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఈవెంట్లు ప్లాన్ చేస్తున్నారని టాక్.



## శేఖర్ కమ్ములకు పెన్ బహుకరించిన చిరు



దర్శకుడు శేఖర్ కమ్ములపై చిరంజీవి ప్రశంసలు కురిపించారు. ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు. పెన్నును బహుమతిగా ఇచ్చారు. తాను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా శేఖర్ కమ్ముల ఇటీవల చిరంజీవిని కలిసిన విషయం తెలిసిందే. కలలను వెంటాడితే విజయం తప్పకుండా మనల్ని ఫాలో అవుతుందని నమ్మకం ఇచ్చిన వ్యక్తి చిరంజీవి అని.. తన 25 ఏళ్ల ప్రయాణాన్ని ఆయన సమక్షంలో చేసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆ ఫొటోలనే ఇప్పుడు చిరు షేర్ చేశారు. మీలాంటి అభిమానులు ఉండడం నాకూ ఆనందమే. మీ ప్రస్థానానికి నేను స్ఫూర్తినిచ్చానని తెలిసి మరింత సంతోషించాను. మీ 25 ఏళ్ల జర్నీలో నేనూ భాగమైనందుకు గర్వంగా ఉంది. సున్నితమైన వినోదంతో పాటు సందేశాన్ని జోడిస్తూ ఆలోచనాత్మకంగా తీసే మీ సినిమాలంటే నాకు ఎంతో ఇష్టం. ఫిల్మ్ మేకింగ్‌లో మీ కంటూ ప్రత్యేకతను క్రియేట్ చేసుకున్నారు. మీరు ఇలాగే మరో 25 ఏళ్లు జనరంజకమైన సినిమాలు తీస్తూ మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటున్నాను అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

## మా అఖిల్ పెళ్లికి రండి

### చంద్రబాబును ఆహ్వానించిన నాగార్జున

అక్కినేని అఖిల్ పెళ్లి పీటలు ఎక్కే సమయం ఆసన్నమైంది. జూన్ 6న అఖిల్ ఏడడుగులు వేయబోతున్నట్టు తెలుస్తుంది. ఈ క్రమంలో నాగార్జున తన కుమారుడి వివాహానికి పలువురు సెలబ్రిటీలని ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. ఇటీవల తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డిని కలిసి తన కుమారుడి వివాహానికి రావాలని ఆహ్వానించిన నాగార్జున తాజాగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని కలిసారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసి తన చిన్న కొడుకు అఖిల్ వివాహానికి రావాల్సిందిగా చంద్రబాబును స్వయంగా ఆహ్వానించి వివాహ పత్రిక అందజేశారు. ఇక ఏపీ డిప్యూటీ సీఎం పవన్



కళ్యాణ్‌ని కూడా నాగార్జున ఆహ్వానించనున్నట్టు తెలుస్తుంది. గతేడాది నవంబర్ నెలలో అక్కినేని అఖిల్, జైనబ్ రవ్జీ అనే అమ్మాయితో నిశ్చితార్థం జరగగా,ఆ విషయాన్ని నాగార్జున తన సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు.


వివాహ మహోత్సవ
శుభాకాంక్షలు
శ్రీమతి & శ్రీ
గడ్డం కేశవమూర్తి - సంధ్యారాణి
Editor, Warangal Voice
మూడుముళ్ళ బంధంతో...
ఏడడుగులు వేసి దాంపత్య బంధంలోకి
అడుగిడుతున్న నూతన దంపతలు
చి॥ సాహిత్ - చి॥ల॥ సౌ॥ కావ్యలకు
వివాహ మహోత్సవ శుభాకాంక్షలు..
మీ వైవాహిక జీవితం నిండునూరేళ్ళు
సుఖసంతోషాలతో.. అష్టైశ్వర్యాలతో,
పిల్లాపాపలతో.. కలకాలం వర్ధిల్లాలని
కోరుకుంటూ..
కళ్యాణ వేదిక :
డ్రీమ్ ల్యాండ్ ఫంక్షన్ హాల్,
కేయూ రోడ్, పెద్దమ్మగడ్డ, హన్మకొండ
విందు : వివాహానంతరం
With Best Compliments From
చి॥ గడ్డం సాహిత్ - చి॥ ల॥ సౌ॥ కావ్య
సామల సూర్యప్రకాష్
వెన్ను రాము
గోలి రవి
సిద్దోజు రాకేష్
తాటికొండ వీరస్వామి
జంపాల మధుసూదన్
బొజ్జం చొక్కారావు
మైదంశెట్టి సాంబయ్య
పూజారి విజయ్ కుమార్
పూజారి శ్రీనివాస్
ఉప్పగిరి శ్రీకాంత్
వరంగల్ వాయిస్ Evening Daily
WARANGAL VOICE
Telugu Daily News Paper
Management & Staff